

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పైలెట్ ప్రాజెక్టుగా ‘ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి‘ కార్యక్రమం కోసం శనివారం మిస్ ఆసియా రేష్మి ఠాకూర్ పోచంపల్లి సందర్శించారు. ఆమెతో పాటు మల్టీ నేషనల్ కంపెనీల ఉన్నత స్థాయి అధికారులు, ఫ్రాన్స్ క్యాన్సులేట్ ప్రతినిధులు వివిధ సాంఘిక మాధ్యమాల ప్రతినిధులు పాల్గొన్నారు.


ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
ఆదివారం | 09 ఆగస్టు , 2026 | పేజీలు :6


# ‘సాగర్’ నీరు తాగునీటికే

## వరి వద్దు, ఆరుతడి పంటలు వేయాలి

## జూన్ 2027 వరకు తాగునీటికి ఢోకా లేదు : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టు లో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, పైనుండి నీరు వచ్చే అవకాశం లేనందున రైతులు ఎట్టి పరిస్థితుల్లో వరి వేయకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడారు.ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజ్ లో ఉందని, శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని తెలిపారు. ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని, వీటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు.ఏఎంఆర్‌పిఎస్ కూడా సగమే నిండినదని, గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదని చెప్పారు.జిల్లాలో పంట మార్పిడిలో భాగంగా 33 వేల ఎకరాల్లో వరికి బదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని, దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకొని రైతులతో ఆరుతడి పంటలు వేయించాలని సూచించారు.జిల్లాలో 9 వేల ట్రాన్స్‌ఫార్మ ర్లపై ఉన్న ఓవర్‌లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామగ్రిని తెప్పిస్తామన్నారు. కరువు వచ్చినాజిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్‌ఎల్‌బిసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని, పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.జిల్లాకు 5 వేల యూనిట్ల స్ప్రింక్లర్లు కావాలని అధికారులు కోరగా తక్షణమే వాటిని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ ఎల్ నినో వల్ల రాబోయే రోజుల్లో సాగునీటికి మరింత ఇబ్బంది ఏర్పడే ప్రమాదం ఉందని, అందువల్ల పంట మార్పిడిపై రైతుల వద్దకు వెళ్లి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పని చేసి రైతులను చైతన్యం చేయాలని,ఈ సంవత్సరం వర్షాలు తక్కువ ఉన్నందున పంట మార్పిడి కింద మెట్ట పంటలు వేసుకునే విధంగా చైతన్యం చేయాలన్నారు.జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎల్ నినో వల్ల వర్షాలు లేనందున ప్రాజెక్టుల్లో కూడా సరైనంత నీరు లేదని, రానున్న రోజుల్లో పై నుంచి సాగునీరు వచ్చే అవకాశాలు లేవని తెలిపారు.సెప్టెంబర్‌లో కూడా సూపర్ ఎల్ నినో ప్రభావం ఉంటుందని, ఉత్తర తెలంగాణకు మాత్రమే అక్కడక్కడ వర్షాలు వచ్చే అవకాశం ఉందని, దక్షిణ తెలంగాణకు వర్షాలు లేవన్న వాతావరణ శాఖ సూచనలను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సమావేశంలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్ రెడ్డి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, హాలియా,నిడమనూరు పిఎసిఎస్ అధ్యక్షులు,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ తదితరులు హాజరయ్యారు.




# రైతు కన్నీరు.. యువత నిరాశ..

# మోదీ పాలనపై ప్రజా పోరాటం

## ధరలు తగ్గించే వరకూ.. ఉద్యోగాలు ఇచ్చే వరకూ పోరాటం ఆగదు:

## నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి ప్రాజెక్టులు పూర్తి చేయాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మునుగోడు నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల కారణంగా భూములు,ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించి,పునరావాస చర్యలు చేపట్టి ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేసి పూర్తి చేయాలని సిపిఐ కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు.ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేస్తున్న నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుండా పనులను కొనసాగించడం సరికాదన్నారు.ప్రాజెక్టుల కోసం భూములు తీసుకునే ముందు నిర్వాసితుల హక్కులను ప్రభుత్వం గుర్తించాలి.నష్టపరిహారం,పునరావాసం పూర్తి చేసిన తర్వాతే పనులను ముందుకు తీసుకెళ్లాలి. నిర్వాసితుల కన్నీళ్లపై ప్రాజెక్టులు నిర్మించడం సరికాదు అని ఆయన అన్నారు.సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన జాతలు మునుగోడు నియోజకవర్గంలో శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. మండలంలోని శివన్నగూడ, కుదాబాక్స్‌పల్లి,అజిలాపురం,తిరుగండ్లపల్లి, తమ్మడపల్లి, ఎరుగండ్లపల్లి, కొండూరు, మర్రిగూడ, వట్టిపల్లి, రాంరెడ్డిపల్లి, లెంకలపల్లి, సారంపేట,ఇందుర్తి,కొట్టాల తదితర గ్రామాల్లో సిపిఐ నాయకులు పాదయాత్ర నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించారు.రైతు కన్నీరు,యువత నిరాశ,సామాన్యుడిపై ధరల భారం పెరుగుతున్నా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.ధరలు తగ్గించి,యువతకు ఉద్యోగాలు కల్పించి,రైతులకు పంటల మద్దతు ధరకు చట్టబద్ధ హామీ ఇచ్చే వరకు ప్రజా పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఈదుల భిక్షంరెడ్డి,మండల కన్వీనర్ బుర్ర శేఖర్,కార్యవర్గ సభ్యులు ఎరుకలి నిరంజన్,జక్కల అంజయ్య, గోని వెంకటయ్య,వేముల సత్తయ్య,కల్లెట్ల లింగయ్య సత్యం,కొట్టం యాదయ్య, జిల్లా బాలకృష్ణ, నరసింహ,ఎర్జాల మహేందర్,పున్నం లక్ష్మయ్య, చిలివేరు రామచంద్రం,జాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బుడిగపాక జగన్, కార్యదర్శి చెల్లం పాండురంగారావు తదితరులు ఆటపాటలతో ప్రజలను ఆకట్టుకుంటూ పాదయాత్రలో ఉత్సాహం నింపారు.





## ఆసరా వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర ప్రభుత్వం శనివారం నుంచి స్వీకరిస్తున్న పెన్షన్ దరఖాస్తులలో వృద్ధాప్య పెన్షన్లను చేర్చకపోవడం దారుణమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులకు ప్రభుత్వ నిర్ణయం తీరని నిరాశ కలిగించిందని తెలిపారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనబెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే వృద్ధాప్య పెన్షన్లను కూడా స్వీకరించి అర్హులకు ఆసరా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లు గౌతమ్ రెడ్డి, భావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షకార్యదర్శులుగా బోయపల్లి రాజేష్ , సత్యం



**ప్రజాపక్షం/చండూరు:** సర్పంచ్‌ల ఫోరం చండూరు మండల అధ్యక్షుడుగా తుమ్మలపల్లి సర్పంచ్ బోయపల్లి రాజేష్ గౌడ్ , ప్రధాన కార్యదర్శిగా కస్తాల సర్పంచ్ లేదన్న సత్యంలు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా పడమటితాళ్ల సర్పంచ్ గాలెంక రాంబాబు, జోగూడెం సర్పంచ్ ఆలేటి యాదయ్య , కార్యదర్శులుగా ఉడుతలపల్లి సర్పంచ్ కావలి శివాని సురేష్ , బోండిగిపర్తి సర్పంచ్ బొమ్మల సుగుణ శంకర్ , కోశాధికారిగా చామలపల్లి సర్పంచ్ ముదిగొండ ఆంజనేయులు ఎన్నికైయ్యారు. సర్పంచ్‌ల ఫోరం మండల నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన బోయపల్లి రాజేష్ గౌడ్‌ను తోటి సర్పంచ్‌లు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుల్లెంల సర్పంచ్ ముక్కాంల వెంకన్న , చొప్పరివారిగూడెం సర్పంచ్ జాల వెంకన్న , శిర్ధపల్లి సర్పంచ్ దామెర రాములు , గొల్లగూడెం సర్పంచ్ రావుల రజిత రవి పాల్గొన్నారు.

## దాతల సహాయంతోనే దేవాలయం అభివృద్ధి

**ప్రజాపక్షం/మునగాల:** దాతల సహాయంతోనే దేవాలయం దినదినాభివృద్ధి చెందుతుందని దేవాలయ కమిటి చైర్మన్ పొలిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామ శివారులో స్వయంభు శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రతి శనివారం దేవాలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దాతల సహాకారంతోనే అన్నదానం నిర్వహిస్తున్నామని, 300 మంది భక్తులు అన్నదానంలో పాల్గొన్నారని తెలిపారు.



## ఎఐవైఎఫ్ 15వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/నాంపల్లి** :ఏఐవైఎఫ్ 15వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి చిన్నోజు వెంకటాచారి పిలుపునిచ్చారు.మండలంలోని మల్లపురాజుపల్లి గ్రామంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ ఆగస్టు 13 న మునుగోడు మండలం సత్య ఫంక్షన్ హాల్‌లో జిల్లా మహాసభల జరుగుతాయని తెలిపారు.ఈ మహాసభలకు నాంపల్లి మండలం నుండి యువకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.మన దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమైనదని అన్నారు.యువతరంలో ప్రగతిశీల,అభ్యుదయ భావాలను,దేశభక్తి, లౌకిక,ప్రజాస్వామిక ఆలోచనలను, నైతిక విలువలను, మానవత్వాన్ని పాదుకొల్పడానికి అఖిల భారత యువజన సమాఖ్య అనునిత్యం కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ కార్యదర్శి పల్లెటి దశరథ,సీనియర్ నాయకులు గొడ్డెటి సత్తయ్య, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2001 నుండి మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పించి సముచిత స్థానం కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు జొన్నలగడ్డ రంగారెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 2001 నుండి మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు సమావేశమయ్యారు. కే కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన ఉద్యమకారుల కమిటీకి మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో 2001 నుండి మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల జాబితాను అందించినట్లు చెప్పారు. ఉద్యమకారులకు పింఛన్లు, ఇంటి స్థలాలు, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అర్హులైన వారికి



ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఆనాడు పోరాటంలో పాల్గొన్న ఉద్యమకారులకు ఉద్యమ గుర్తింపు కార్డులు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో కాజా మొయినుద్దీన్, చెలిమెండ్ల పద్మయ్య, ధనావత్ శంకర్ నాయక్, సింగాపురం మల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, జయమ్మ, నాగయ్య, వీరారెడ్డి, సాజిద్ ఖాన్, సంపత్, నాగరాజు, రవి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## నేరేడుచర్ల ప్రధాన రహదారిపై పశువులు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పట్టణంలోని జాతీయ రహదారిపై రాత్రివేళ్లలో పశువులు రోడ్డుపై సంచరిస్తూ వాహనదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పశువుల సంఖ్య ఎక్కువగా లేకపోయినా అవిరోడ్డుపైనే పడుకోవడం కొన్నిసార్లు రహదారి మధ్యలోనే ఎటు కదలకుండా నిలబడిపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. జాతీయరహదారిపై అధిక వేగంతో ప్రయాణించే వాహనాలు రాత్రి సమయంలో ప్రయాణించే వాహనాలు రాత్రి సమయంలో లైట్ వెలుతురుకు పశువులను గుర్తించలేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అటు ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాలు ప్రమాదాల బారీన పడే అవకాశాలు పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రతిరోజు ఇదే పరిస్థితి కొనసాగుతుందని, రాత్రిసమయంలో ఈ మార్గంలో ప్రయాణించే వారు అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు పేర్కొంటున్నారు. యాజమానులకు తమ పశువులను రహదారులపై వదిలేయకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## బాధిత వికలాంగుడికి పోలీసుల భరోసా

### దాతల సహకారంతో ట్రై సైకిల్ అందజేసిన ఎస్ఐ నరేష్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. హుజూర్‌నగర్ పోలీసులు, పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీకి చెందిన ఇందిరాల పిచ్చయ్యకు దాతల సహకారంతో నూతన ట్రై సైకిల్‌ను అందజేసి భరోసా కల్పించారు. పిచ్చయ్య గత నెలలో తన నివారం బయట ట్రై సైకిల్‌ను పార్కింగ్ చేయగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆది తీవ్రంగా దెబ్బతిని వినియోగానికి పనికిరాకుండా పోయింది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పిచ్చయ్య పోలీసులను అశ్రయించారు. బాధితుడి పరిస్థితిని తెలుసుకున్న పోలీసులు స్పందించి అతని దైనందిన అవసరాలకు ట్రై సైకిల్ ఎంతగానో అవసరమని గుర్తించారు. దాతల సహకారంతో నూతన ట్రై సైకిల్‌ను సమకూర్చి శనివారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ నరేష్ చేతుల మీదుగా పిచ్చయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ ఎస్ఐ హనుమానాయక్, ఎఎస్ఐ బలరాంరెడ్డి, పోలీస్ సిబ్బంది శ్రీనివాసరెడ్డి, జాని మియా పాల్గొన్నారు.



## ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకుండా వాయిదాలు వేయడం పరిపాటిగా మారిపోయిందని టాప్రా రాష్ట్ర నాయకులు నూకల జగదీష్‌చంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా రావాల్సిన ఆరు డీఏ బకాయిలను నిలిపివేయడం శోచనీయమన్నారు. అధికారంలోకి రాగానే పెండింగ్ డీఏలు, ఆరు నెలల్లో కొత్త పీఆర్సీ అమలు చేస్తామన్న హామీలు నినాదాలుగానే మిగిలిపోయాయని తెలిపారు. మూడేళ్ల గడుస్తున్నా పీఆర్సీ నివేదిక అందని ద్రాక్షలా మారిందన్నారు. ఉద్యోగ విరమణ పొంది రెండేళ్లయినా బకాయిలు రాక వందకు పైగా పెన్షనర్లు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 17న ఏర్పడిన ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ విడుదల చేసిన ఆసుపత్రుల జాబితా అసమగ్రంగా ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ డీఏలు, పీఆర్సీ, పెన్షనర్ల బకాయిలను విడుదల చేయాలని కోరారు.

## ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న అన్నారు. శనివారం 9వ వార్డులోని పాత ఫైర్ స్టేషన్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన టిబి నిర్ధారణ, చిన్నారుల నెలవారి టీకా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. టిబి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నిర్ధారణ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌ఛార్జి ఉపేంద్ర, ఎఎన్ఎం వెంకటరమణ, ఆశా కార్యకర్త గంగ, అంగన్‌వాడీ టీచర్ పద్మ, విమలమ్మ, వార్డు నాయకులు ఈదుల జానయ్య, వైద్య ఆరోగ్య సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## బిసి హక్కుల సామాజిక న్యాయ పోరాట సభను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** కాంగ్రెస్ బిసిలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఈనెల 9న నల్లగొండ పట్టణంలో రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు ఆధ్వర్యంలో జరిగే బిసి హక్కుల సాధనకై సామాజిక న్యాయ పోరాట సభను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలోని సభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా పలువురు బిసి నాయకులు మాట్లాడుతూ లోక్‌సభ, శాసనసభలలో బిసిలకు 33శాతం మహిళ రిజర్వేషన్ల బిల్లులో బిసి మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. బిసి విద్యార్థుల స్కాలర్‌షిఫ్, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను గతంలో మాదిరిగానే నేరుగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకి విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మూషం నర్సింహా, గుర్రం మార్కేండేయ, పిల్లలమర్రి పుల్లారావు, చెరుకుపల్లి నర్సింహా, ఇంజమూరి వెంకటేశ్వర్లు, చిటిపోలు ఉపేందర్, రావిరాల యుగేందర్, నాగరాజు, రవి పాల్గొన్నారు.

## మోటకొండూర్ నూతన ఎస్ఐగా కుమార స్వామి యాదవ్

**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూర్ నూతన ఎస్సైగా కుమార స్వామి యాదవ్ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన అశోక్ హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని తెలిపారు.

## చేయూత పింఛన్లు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి:** రాష్ట్రంలో చేయూత పథకం కింద కొత్త ఫించన్ల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రీయ శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ శుక్రవారం ఉత్తర్వులుజారీ చేసిందని మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 15 నుండి కొత్త ఫించన్ల మంజూరుకు ప్రభుత్వం అదేశించిన నేపథ్యంలో అధికారులు దరఖాస్తుల స్వీకరణ సంబంధించిన మార్గదర్శకాలను నిరంతరం స్వీకరించినున్నట్లు , ఇందుకు ఎలాంటి చివరితేదీ లేదని స్ప ష్టం చేశారు. కొత్త ఫించన్ల మంజూరులో కొన్ని వర్గాల కు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించిందని ఒంటరి మ హిళలు, వితంతువులను పరిగణించనున్నారు. గ్రామీ ణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో వార్డు అధికారులు ఈ వివరాలను ధృవీకరించనున్నారు.

## ఇకెవైసి తప్పనిసరి

**ప్రజాపక్షం/నడిగూడెం:** ఇండియన్ గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించిన ఈ కేవైసి ప్రక్రీయను ఈనెల 16లోపు తప్పనిసరిగా పూర్తి చేయించుకోవాలని నడిగూడెం శ్రీసాయిరమ్య ఇండియన్ గ్యాస్ మేనేజర్ చిల్లంచర్ల సత్యనారాయణ కోరారు. ఆధార్‌కార్డు, డిస్ట్రిబ్యూటర్ పాస్ పుస్తకం, గ్యాస్ కనెక్షన్ వివరాలతో ఇండియన్ గ్యాస్ కార్యాలయాన్ని సంప్రదించి ఈకేవైసి పూర్తి చేయించుకోవాలన్నారు. ఇంటి వద్ద ఇండియన్ ఆయిల్ వన్ యాప్ ద్వారా, డిస్ట్రిబ్యూటర్ వద్ద, డెలివరీ సిబ్బంది ద్వారా ఈకేవైసిని పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈకేవైసి చేయించుకోకపోతే వినియోగదారులు సిలిండర్లు పొందేందుకు అనర్హులు అవుతారని పేర్కొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యక్తిపై దాడి...

### కేసు నమోదు

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న నెర్నకంటి శ్రీను అనే వ్యక్తిపై బుర్రి నర్సింహారావు అనే వ్యక్తి దాడిచేసి గాయపర్చాడు. హస్పటల్ పాతబడిన నిరుపయోగంగా ఉన్న భవనంలో పడుకోవద్దని నర్సింహారావుకు చెప్పడమేదీనికి కారణం. దీనిని మనసులో ఉంచుకుని శ్రీనుపై కక్షతో ఈ దాడికి పాల్పడ్డాడు. బాధితుడి భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన శ్రీను ప్రస్తుతం ఖమ్మం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరు రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బిఆర్ఎస్ శ్రేణులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బొట్ల యాదయ్య, బిఆర్ఎస్ మండల నాయకులు అనంతుల జంగారెడ్డి, పన్నాల అంజిరెడ్డి, జీవలికపల్లి వెంకటేష్, ఎండి బురాన్, బోలగాని లక్ష్మీ నారాయణ, ఎర్ర మల్లేష్ యాదవ్, బొట్ల ప్రశాంత్, రేగు నాగులు, మల్గ వెంకటేష్, బొట్ల మహేష్, మధు, బాల్ద లింగం పాల్గొన్నారు.



## సమకాలీన సమాజానికి దర్పణం భూతం ముత్యాలు సాహిత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సమాజంలోని అన్యాయం,వివక్ష,దోపిడీ వంటి అనేక సామాజిక అపసవ్యాలపై తన కలాన్ని ఎక్కుపెట్టి,అట్టడుగు వర్గాల జీవితాలను సాహిత్యంలో ప్రతిబింబించిన దిశాలి రచయిత భూతం ముత్యాలు అని ప్రముఖ సాహితీవేత్త మునాసు వెంకట్ అన్నారు. శనివారం స్థానిక ఎంబీఎన్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన భూతం ముత్యాలు అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.భూతం ముత్యాలు రచించిన సూర నవల కాకతీయ విశ్వవిద్యాలయంలో సిలబస్‌గా ప్రవేశపెట్టి పదేళ్లు పూర్తయిన సందర్భంగా సిలువేరు సాహితీ కళాపీఠం ఆధ్వర్యంలో ఈ అభినందన సభను నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త మేరెడ్డి యాదగిరిరెడ్డి సభకు అధ్యక్షత వహించారు.ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ పగడాల నాగేందర్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా దళిత,బహుజన అస్తిత్వ ఉద్యమాలకు ఒక ముఖ్యమైన కేంద్ర బిందువుగా నిలిచిందన్నారు. సిలువేరు సాహితీ కళాపీఠం అధ్యక్షుడు సిరివెరు లింగమూర్తి సభ సమన్వయకర్తగా వ్యవహరించారు.కార్యక్రమంలో సృజన సాహితీ అధ్యక్షుడు పెరుమాళ్ల ఆనంద్,విశ్రాంత లైబ్రేరియన్ వెంకట్, నిమ్మల భీమార్జున్ రెడ్డి,డాక్టర్ హసేనా,డాక్టర్ సాగర్ల సత్తయ్య,శ్రవణ్ కుమార్,బండారు శంకర్,చెరుపల్లి సంధ్య,శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి రోస్టర్ మార్చకపోతే ప్రభుత్వాన్ని మరుస్తాం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోస్టర్ ను సవరించకపోతే మాలల ఆగ్రహానికి గురి కాక తప్పదని జాతీయ మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ హెచ్చరించారు.రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ శనివారం నల్లగొండ లోని గడియారం సెంటర్లో జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యులు గోలి సైదులు అధ్యక్షతన చేపట్టిన మాలల మహాధర్నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ అనంతరం గ్రూప్3 లో ఉన్న మాల దాని అనుభంద 25 కులాలకు విద్యా,ఉద్యోగాలల్లో, ప్రమోషన్ లల్లో తీవ్ర అన్యాయం జరుగుతుంది అని వాపోయారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలల భవిష్యత్‌ను నాశనం చేస్తున్నాడని తడిగుడ్డతో మాలల గొంతు కోస్తున్నాడని అన్నారు,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిరంకుశ విధానాలను తెలవడానికి మాలల విద్యా ఉద్యోగ అవకాలను గండి కొడుతున్న సందర్భంగా ఈ నెల అగస్టు 31 న సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునిస్తున్నాము, మాలలు,ప్రజాస్వామిక వాదులు మద్దతివ్వాలని తెలిపారు.మాల జెఎసి కన్వీనర్ సర్వయ్య మాట్లాడుతూ మాలల విద్యా,ఉద్యోగ అవకాలపట్ల తీవ్ర అన్యాయం జరుగుతుంది, రోస్టర్ లో 20 లోపు మూడు పాయింట్ లు ఇవ్వాలి, మాలలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు బోగరి విజయ్,నల్లవెల్లి సంజీవ,నల్లల కనఖరాజు,మేడి అంజయ్య,వెన్న రాజు,బుట్టి సత్యనారాయణ,సర్వే సార్, కళాకారుడు గోరేటి రమేష్,కట్ట వినయ్,చింతమల్ల విజయ్ కుమార్,వల్లం రవి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత విద్యుత్ సరఫరాలో ప్రభుత్వం విఫలం



**ప్రజాపక్షం/హాలియా:** రైతులకు అంతరాయం లేని విద్యుత్తును సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. శనివారం హాలియా సెంటర్లో ఉచిత విద్యుత్ సరఫరాలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహా ధర్నా కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ గత టీఆర్ఎస్ ప్రభుత్వంలో అంతరాయం లేని విద్యుత్తు సరఫరా చేసి రైతులను ఆదుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం 6 గంటల విద్యుత్తు అంతరాయం లేకుండా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు ధర్నా చేస్తున్న పార్టీ నాయకులతో మాట్లాడి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్ రెడ్డి,నల్గొండ సుధాకర్,వర్ర వెంకటరెడ్డి,సురభి రాంబాబు,పిడిగం నాగయ్య,కేతావత్ బిక్ష నాయక్, బైరెడ్డి సత్యనారాయణరెడ్డి,పొదిలి శ్రీనివాస్,సుందర్ రెడ్డి,కడమంచి శ్రీను,చేగొండి కృష్ణ పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరాలి



**ప్రజాపక్షం/కోదాడ:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చి జీవితంలో స్థానాలకు చేరుకోవాలని సూర్యాపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బద్దం కోటిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కోదాడ నియోజకవర్గ స్థాయి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న అండర్14, అండర్18 వాలీబాల్ పోటీలను శనివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వంగవీటి రామారావు, దేవరపల్లి మల్లేశ్వరి లు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడాప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. భవిష్యత్‌లో ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఏనుగు ఉపేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ షేక్ బషీర్, పందిరి నాగిరెడ్డి, కౌన్సిలర్ సైదిబాబు, మామిడి రామారావు, పట్టణ ప్రముఖులు వేముల వెంకటేశ్వర్లు, వేనేపల్లి శ్రీనివాసరావు, నామ నర్సింహారావు, బడుగుల సైదులు, పంది తిరపతయ్య, ముస్తాఫా, వ్యాయమ ఉపాధ్యాయులు చారి, కొండలు, విద్యార్థులు పాల్గొన్నారు.



## జలసిరిలో మున్సిపాలిటీలకు అవకాశం ఇవ్వాలి

**ప్రజాపక్షం/హాలియా:** ప్రతి వర్షపు నీటిబొట్టును ఒడిసి పట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నీటి వనరుల పరిరక్షణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలో మున్సిపాలిటీలకు కూడా అవకాశం కల్పించాలని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి కోరారు. శనివారం నల్గొండలో జిల్లా నీటిపారుదల సలహా మండలి నిర్వహించిన సమావేశంలో హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ జలసిరి కార్యక్రమంలో మున్సిపాలిటీలను పరిగణలోకి తీసుకొని ఇంకుడు గుంతల ఏర్పాటు కు అవకాశం కల్పించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. హాలియా మున్సిపాలిటీలో కూడా తాకినీటి సమస్య నెలకొందని ఈ సమస్య తీరాలంటే రంగారెడ్డిగూడెంలో గల మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ నుంచి ఎక్కువ మొత్తంలో నీటిని ఇక్కడికి తరలించినట్లయితే హాలియా ప్రజల తాగునీటి సమస్య తీరుతుందని సమావేశంలో సంబంధిత అధికారులకు వివరించారు.

## డా.బిఆర్ అంబేద్కర్ అభయహస్తం పథకం అమలు చేయాలి

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** డాక్టర్ బిఆర్ అభయహస్తం పథకం వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కూరెళ్ల రమేష్ మాదిగ, జిల్లా కన్వీనర్ బోట్ల శ్రీనివాస్ మాదిగ అన్నారు. వారు మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో ఆలేరులోఈనెల 11న జరిగే ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సు జయప్రదం చేయాలని కోరుతూ కరపత్ర ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్ల పోరాట ఫలితంగా ఏబీసీడి వర్గీకరణ జరిగిందని, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పథకం వెంటనే ప్రకటించి విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలేరు రెవిన్యూ డివిజన్ గా ప్రకటించాలని, దళిత క్రిస్టియన్లు మతం మారిన వారికి ఎస్సీ హోదా ఉండేటట్లు ప్రభుత్వం చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వంగపల్లి చిరంజీవి, మండల నాయకులు పల్లె మైసయ్య, ఆడపు బిక్షపతి, యువసేన జిల్లా నాయకులు ముదుగుల శ్రీకాంత్, యువసేన మండల నాయకులు కొల్లూరు మధు, జంపాల ఆత్మరావ్, వంగపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి

**ప్రజా పక్షం/ఆత్మకూరు(యం) :** మండలానికి బీసీ గురుకుల పాఠశాలను మంజూరు చేయాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకులు శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్లోని మినిస్టర్ క్వార్టర్స్లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం సమర్పించినట్లు నాయకులు తెలిపారు. ఆత్మకూరు మండలంలో బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యం కల్పించేందుకు బీసీ గురుకుల పాఠశాల అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి, త్వరలోనే బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలానికి గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కందడి అనంతరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు గౌడ్, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి, బీర్ల ఫౌండేషన్ ఇన్చార్జి బత్తిని ఉప్పలయ్య గౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు సోలిపురం ఎల్లారెడ్డి, కోసన లక్ష్మీ కిష్టయ్య పాల్గొన్నారు.



## పెన్షన్ కోసం దరఖాస్తు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం)** : పెన్షన్ల కోసం ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారుల నుండి పెన్షన్లకు దరఖాస్తు ఫారాలు స్వీకరించడం జరుగుతుందనీ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్, వితంతు పెన్షన్, ఒంటరి మహిళల పెన్షన్, గీత కార్మికుల పెన్షన్, చేనేత కార్మికుల పెన్షన్, పైలేరియా బాధితుల పెన్షన్, డయాలసిస్ రోగుల పెన్షన్, తలసేమియా బాధితుల పెన్షన్ కోసం ఈ నెల11వ తేదీ నుండి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అర్హులైన ప్రతి ఒక్కరి నుండి పెన్షన్ దరఖాస్తు ఫారాలు స్వీకరించడం జరుగుతుందనీ, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నేలపట్ల చేనేత సొసైటీ అధ్యక్ష ఎన్నికపై స్టే ఇచ్చిన ట్రిబ్యునల్ కోర్టు

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : చౌటుప్పల్ మండలం నేలపట్ల చేనేత సహకార సంఘం అధ్యక్షులు పిల్లలమర్రి శ్రీనివాస్ ఎన్నికపై ట్రిబ్యునల్ కోర్టు స్టే విధించింది. పిల్లలమర్రి శ్రీనివాస్ సహకార సంఘం ఎన్నికల్లో డైరెక్టర్‌గా పోటీ చేసి గెలుపొంది సొసైటీ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా పిల్లలమర్రి శ్రీనివాస్ కు ముగ్గురు సంతానం ఉండడంతో మరో ప్యానెల్ డైరెక్టర్లు కోర్టుకు వెళ్లారు. శ్రీనివాస్‌కు ముగ్గురు సంతానం ఉన్నారని ఆధారాలు సమర్పించడంతో విచారించిన జడ్జి శ్రీనివాస్ డైరెక్టర్ ఎన్నిక, చైర్మన్ ఎన్నికపై స్టే విధించారు.

## ఎంపి చామల కీలక బాధ్యత నియామకంపై హర్షం వ్యక్తం

**ప్రజాపక్షం/రామన్నపేట** : ఏఐసీసీ తెలంగాణ పీసీసీ మీడియా ,ప్రచార కమిటీ చైర్మన్ గా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ నియమించింది. ఈ నియామకంపై మాజీ ఎంపీటీసీ, మాజీ డిసిసి ప్రధాన కార్యదర్శి తాటిపాముల శేఖర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని, తెలంగాణకు రావాల్సిన నిధులు రాబట్టడంలో ఎంపీ చామల కీలకంగా ఉంటారని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీలకు కృతజ్ఞతలు తెలిపారు.

## రూ. లక్ష విలువైన సామాగ్రి అందజేత

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల పరిధిలోని వెంకట్రాంపురం గ్రామ ప్రాథమిక పాఠశాలకు హైద్రాబాద్‌కు చెందిన గోకరాజు గంగరాజు ట్రీట్ కాజ్ సంస్థ సుమారు లక్ష విలువైన సౌకర్యాలు అందించారు. పాఠశాలకు రంగులు వేయించటంతో పాటు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో సంస్థ ప్రతినిధులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థకు చెందిన కళాశాల విద్యార్థులు హాజరై సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## 10న జరిగే 'జైల్ భరో'లో పాల్గొనాలి




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:**10న జిల్లా కేంద్రంలో జరిగే జైల్ భరో కార్యక్రమానికి వేలాది కార్మికులు, వ్యవసాయ కార్మికులు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జాతీయరహదారిపై నిరసన కార్యక్రమంకు తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్, అఖిలభారత రైతుకూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జునరెడ్డి లు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో జరిగిన ఎస్‌కెఎం జాతియ కమిటి పిలుపుమేరకు నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. 1942లో మనదేశ వలస కార్మికులకు వ్యతిరేకంగా జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం జరిగిన ఆగస్టు 10న క్విట్ కార్పోరేట్ పేరుతో ఎస్‌కెయం ఆధ్వర్యంలో రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, నాయకులు నాగయ్య్య, కందాల శంకర్‌రెడ్డి, వరికొప్పుల వెంకన్న, మాదవ్, నెమ్మాది వెంకటేశ్వర్లు, గంట న నాగయ్య, రాంబాబు, కునుకుంట్ల సైదులు, బూర వెంకటేశ్వర్లు, పుల్లూరి సింహాద్రి పాల్గొన్నారు.

## రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** సూర్యాపేట నుండి తుంగతుర్తికి వెళ్లే ప్రధాన రహదారి రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ నాయకులు శనివారం గుంతలు పడి చెరువుల కనిపించే రోడ్డుపై వరినాట్లు వేసి గాళాలతో చేపలు పడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు తడకమల్ల రవికుమార్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆధ్వర్యంలో జాజిరెడ్డిగూడెం నుండి మానాపురం ఎక్స్ రోడ్డు వరకు 28 కోట్ల రూపాయలతో 2023 నవంబర్‌లో మాజీ మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా నూతన రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేలు అదే రోడ్డుకు పనులకు జాజిరెడ్డిగూడెం నుండి మానాపురం తండా మళ్లి ఆయన పేరుతో శిలాఫలకం వేసి శంకుస్థాపన చేసి మూడు సంవత్సరాలు అవుతుందని ఇంత వరకు రోడ్డు పనులు పూర్తి చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొంకూరి మల్లేష్, బొజ్జ సాయికిరణ్, బొంకూరి మధు, కొండగడుపుల వెంకటేష్, కాసర్ల రాజశేఖర్, తడకమళ్ల మధు, బొంకూరి సాయి, కొండ మధు, కడియం గోపి, నాగరాజు పాల్గొన్నారు.

## మన ఆపద్బాంధవులు ఫౌండేషన్ చేయూత



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండలంలోని జనంపల్లి గ్రామానికి చెందిన గంగిరెద్దుల కుటుంబానికి చెందిన అవుల రమేష్ గత నెల 20వ తేదీన గుండెపోటుతో మృతి చెందారు. దీంతో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయి తీవ్ర ఆర్థిక ఎదుర్కొంటున్న పరిస్థితి గమనించి తన భార్య వెంకటమ్మ, ముగ్గురు ఆడపిల్లలతో కలిసి జనంపల్లి గ్రామంలోనే నివాసం ఉంటూ గంగిరెద్దులతో ఊరూరా తిరుగుతూ జీవనం సాగించేవారు. కుటుంబానికి ఇతర ఏలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో ప్రస్తుతం రేకుల ఇంట్లోనే నివాసం ఉంటున్నారు. కుటుంబ పరిస్థితిని గమనించిన జనంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పోషబోయిన మల్లేశం మన ఆపద్బాంధవులు ఫౌండేషన్ ముఖ్య సభ్యులు నీలం శేఖర్ దృష్టికి తీసుకువచ్చారు. వారు వెంటనే స్పందిస్తూ శనివారం ఆ కుటుంబానికి 50 కేజీల బియ్యం 14 రకాల నిత్యవసర సరుకులు వారి నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వేముల సైదులు, బాదే చంద్రశేఖర్, ఈదులకంటి శివకుమార్, సురేష్, రాజు, మృతుని భార్య వెంకటమ్మ, నరేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిర్మించిన కోళ్ల ఫారాలపై చర్యలు



**ప్రజాపక్షం/గుండాల**; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల వ్యాప్తంగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కోళ్ల ఫారాలను నిర్మించడం ద్వారా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గ్రామాలకు సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఉండాల్సిన కోళ్ల ఫారాలు గ్రామానికి కూత వేటు దూరంలో నిర్మించడంతో కోళ్ల ఫారాల నుండి పెద్ద ఎత్తున దురువాసనలు వేలువడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. వర్షా కాలం వస్తే చాలు వర్షాలకు కోళ్ల ఫారాల నుండి పెద్ద ఎత్తున దురువాసనలు రావడంతో పాటు ఈగల, దోమల బెడదతో గ్రామాలలో ప్రజలు అనారోగ్యాల భారీన పడాల్సిన పరిస్థితి నెలకొంది. మొదట ఎటువంటి ఇబ్బందులు ఉండవనుకున్న గ్రామస్థులకు పోను పోను గ్రామాలలో పూర్తి స్థాయిలో దుర వాసనతో పాటు ఈగలు, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. అనుమతులు లేకుండా గ్రామాల సమీపంలో అక్రమంగా నిర్మించిన కోళ్ల ఫారాలపై తక్షణమే చర్యలు తీసుకొని గ్రామాలకు దూరంగా కోళ్ల ఫారాలను తరలించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## బిజెపి మండల మహాసభ

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం)** : భారతీయ జనతా పార్టీ మండల పార్టీ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల బాధ్యతలు నియామకం, మండల మోర్చాలని నియామకం గురించి చర్చ, తీరంగ యాత్ర గురించి సీనియర్ నాయకులు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాలు మండల ప్రధాన కార్యదర్శులుగా గోరుపెల్లి మల్లారెడ్డి, కోరె లక్ష్మ ణ్, మండల ఉపాధ్యక్షులుగా పరకాల రాంబాబు, లోడ్ బద్రి లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బొట్టు అబ్బయ్య పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో నేటి నుండి సిపిఐ ప్రచార యాత్ర

**ప్రజాపక్షం/దేవరకొండ;** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార యాత్ర ఆదివారం దేవరకొండ నియోజకవర్గంలో ప్రారంభం కానున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ పల్లా నర్సింహారెడ్డి తెలిపారు. ఆగస్టు 6న మొదలై ఆగస్టు 14 వరకు సాగనున్న ప్రచాచ యాత్ర దేవరకొండ నియోజకవర్గంలో ఈనెల 09 నుండి 12 వరకు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేయనున్నట్లు నర్సింహారెడ్డి తెలిపారు. ఈ ప్రచార యాత్రలో జాతీయ, రాష్ట్ర, జిల్లా కమ్యూనిస్టు నాయకులు పాల్గొంటారని ప్రచార యాత్ర విజయవంతానికి నియోజవకర్గ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

## నేడు సిపిఐ ప్రచార యాత్ర ప్రారంభం

**ప్రజాపక్షం/డిండి;** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార యాత్ర ఆదివారం డిండి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో ఉదయం సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పల్లా వెంకట్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం మండలంలోని కందుకూరు, బ్రాహ్మణపల్లి, రామంతాపూర్, చెరుకుపల్లి, ఎర్రారం, కే. గౌరారం, గోనబోయినపల్లి, బొగ్గులదోన, జేత్యతండా, గోనకోల్, డిండిలో ప్రచార యాత్ర సాగుతుంది. ఈ యాత్ర విజయవంతానికి మండల కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గ సభ్యులు, గ్రామశాఖల కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రచార యాత్రను విజయవంతం చేయనున్నట్లు సిపిఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి తెలిపారు.

## ప్రజా సైన్స్ ఉద్యమంలో భాగస్వాములవ్వండి



**ప్రజాపక్షం/నకిరేకల్:** శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తూ.. మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ప్రజా సైన్స్ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు కనుకుంట్ల విద్యాసాగర్ పిలుపునిచ్చారు.జేవీవీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం నకిరేకల్‌లోని ఉద్దీపన పాఠశాలలో నకిరేకల్ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు శాస్త్ర విజ్ఞానంపై సరైన అవగాహన కల్పించడం, సమాజంలో పాతుకుపోయిన మూఢ విశ్వాసాలు, ఛాందస భావాలను అరికట్టడం జేవీవీ ప్రధాన లక్ష్యాలని తెలిపారు.ఈసమావేశంలో జేవీవీ జిల్లా కార్యదర్శి గంగాధరి భద్రయ్య,సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వంటెపాక నగేష్,మండలాల బాధ్యులు కుక్కడపు శ్రీనివాస్,అల్లం శంకర్,చల్లోజు శ్రీనివాస్,పి.శ్రీనివాస్,టి.స్వామి,రాంప్రసాద్ పాల్గొన్నారు.

## వస్త్ర వ్యాపారుల సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**ప్రజా పక్షం/నకిరేకల్:** నకిరేకల్ వస్త్ర వ్యాపారుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా అప్పం వెంకన్న, కార్యదర్శిగా గురర్రం వెంకన్న, ఉపాధ్యక్షుడిగా దుస్సా శ్రీనివాస్,కోశాధికారిగా మూడ బిక్షపతి,సహాయ కార్యదర్శిగా కొలను భాస్కర్ ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా ఆర్.అశ్విన్,ఆర్.వెంకటేష్,ఏ.యాదగిరి,పి.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు.గత కమిటీ అధ్యక్షుడు మిర్యాల వెంకటేశం,జిల్లా అధ్యక్షుడు గట్టు శ్యాంసుందర్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు రావిరాల నాగయ్య,కైరం కొండ కిషన్, రాపోలు గురుమూర్తి, ఆంజనేయులు,దొంత వెంకటేశ్వర్లు, రావిరాల అశోక్, అల్వాల నరేందర్, వెంకటేశ్వర్లు తదితర వస్త్ర వ్యాపారులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.



## రిపోర్టర్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తుర్కపల్లి మండల కేంద్రంలో ఇటీవల మరణించిన సాక్షి విలేకరి దుగ్యాల రవికుమార్ మృతి పట్ల మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి, రవికుమార్ నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తుర్కపల్లి జె ఎం ఫంక్షన్ హాల్లో జరిగిన ఆంధ్రప్రభ రిపోర్టర్ కుమారుని తొట్టెల ఫంక్షన్ లో పాల్గొన్నారు. ఆమె వెంట పిఏసీఎస్ మాజీ చైర్మన్ సింగిరెడ్డి నర్సింహారెడ్డి, బిఆరెస్ నాయకులు బోయిని సత్తయ్య, మల్లేష్, షాదుల్లా, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## తల్లిపాల వారోత్సవాలు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎ ంతో అవసరమని కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పద్మ అన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు వేపలసింగారం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈవైద్య సిబ్బంది ఇందిరాల రామకృష్ణ, సావిత్రి, స్వరూప, ఆశా కార్యకర్తలు అంగన్‌వాడీ సిబ్బంది భాగ్యలక్ష్మి , అనిత, జాన్‌బీ, గర్భిణీలు, బాలింతలు,చిన్నారులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్‌కె ఫౌండేషన్ అధినేత పూజలు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నమాత్పల్లి గ్రామంలోని స్వయంభూ శ్రీ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయంలో ఆర్ఎస్‌కె ఫౌండేషన్ అధినేత, సామాజికవేత్త, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని ర్యాకల శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆర్ఎస్‌కె టీం సభ్యులు ర్యాకల శ్రీనివాస్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆర్ఎస్‌కె టీం ఆధ్వర్యంలో దేవాలయానికి విచ్చేసిన భక్తులకు ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుమ్మి నవీన్ రెడ్డి, జోగు సతీష్, పండుగ కిరణ్, మహమ్మద్ యాకుబ్, ఎస్.కె హైమత్, ఉడుత రాజు, ఉడుత శేఖర్, బీట్కూరి లక్ష్మ ణ్ పలువురు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకునికి నివాళి

**ప్రజాపక్షం/రామన్నపేట** : ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొంగడి శ్రీరాములు గుండెపోటుతో మృతిచెందగా వారి పార్థివదేహానికి మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ పూస బాల నరసింహా పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ పెద్దగొని వెంకటేశం, వార్డు సభ్యులు కంబాలపెల్లి సత్తయ్య, కప్పల రాజు, పంది రాజు, నల్ల ఎల్లేష్, రాధారపు మహేష్ మాజీ ఉపసర్పంచ్ గర్దాస్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్‌టియు నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/నిడమనూరు:** పిఆర్‌టియు టీఎస్ నిడమనూరు మండల నూతన కార్యవర్గాన్ని శనివారం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు లావూరి వెంకన్న సమక్షంలో నిడమనూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు,పిఆర్‌టియు నిడమనూరు మండల శాఖ అధ్యక్షునిగా పాంపాటి శ్రీనివాసులు 9వ సారి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా మండల నూతన ప్రధాన కార్యదర్శిగా గుండ్ల కోటయ్య నుఎన్నుకున్నారు, ఉపాధ్యక్షులుగా వి శ్రీధర్ రెడ్డి వి మమత ఏ కోటయ్య సుదర్శన్,లీలా కుమారి, శ్యామల కార్యదర్శులుగా గణేష్,శివ ప్రసాద్,సింధుజ, జ్యోతి ఎన్నికయ్యారు, ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పాంపాటి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఆయన హామీఇచ్చారు. ఎన్నికకు ఎన్నికల అధికారులుగా మంచి కంటి మధు,చెన్ను వెంకట్ రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో మంద సైదులు రావు గౌతమ్,వెంకట్ రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా ర్యాకల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ర్యాకల శ్రీనివాస్తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మండల అధ్యక్షులు జనగాం పాండు, పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్, నీల ఓం ప్రకాష్ గౌడ్, చందుపట్ల మాజీ పిఏసిఎస్ బ్యాంక్ చైర్మన్ బల్గూరి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిజెపి పోరాటాలు



**ప్రజాపక్షం/చండూరుః** తెలంగాణ రాష్ట్రంలో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తుందని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలం చెందిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం చండూరులో నిర్వహించిన పార్టీ కార్యవర్గ సమావేశానికి మనోహర్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అక్కడే ఏర్పాటు చేసిన పార్టీ జెండాను జిల్లా పార్టీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఎగురవేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు ఇస్తుంటే స్థానిక ఎమ్మెల్యే బిజెపి సర్పంచ్‌లకు ,కౌన్సిలర్లకు నిధులు మంజూరు చేయకపోవడం శోచనీయం అని అన్నారు. అనంతరం చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కళాకారులను ఘనంగా సన్మానించారు. బిజెపి మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు , బిజెపి పట్టణ అధ్యక్షుడు భూతరాజు శ్రీహరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు దోనూరి వీరారెడ్డి , కర్నాటి ధనుంజయ్య, కోమటివీరేశం , బొమ్మరబోయిన రాజు, జక్కల రాజు, వరికుప్పల గిరి పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ తుర్కపల్లి మండల అధ్యక్షులు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా పాలసీ రాష్ట్ర కన్వీనర్ సురివి శ్రీనివాస్ గౌడ్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సురివి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తుర్కపల్లి మండలంలోని ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్, జిల్లా మీడియా కోకన్వీనర్ భానోత్ శంకర్ నాయక్, రాష్ట్ర ట్రేడర్స్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందుకూరి చల్మయ్య, మాజీ సర్పంచ్ జక్కుల వెంకటేశం, గొర్ల రామచంద్రం, గుండెబోయిన మల్లేశం పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చ అధికార ప్రతినిధిగా కుమారస్వామి నియామకం



**ప్రజాపక్షం/మర్రిగూడ** :బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చ అధికార ప్రతినిధిగా మండలంలోని ఎర్రగండ్లపల్లి గ్రామానికి చెందిన నరోజు కుమారస్వామిని ఈ పదవికి నియమిస్తూ శుక్రవారం పార్టీ అధిష్టానం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుమారస్వామి మాట్లాడారు తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు,రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి,ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ కుమార్, నల్లగొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి,నియోజకవర్గ నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోబిజెపి సీనియర్ నాయకులు మామిడి పరశురాం, ఓబిసిమోర్చా మాజీ మండల అధ్యక్షులు పగిళ్ల లింగస్వామి,బూత్ అధ్యక్షులు ఆమంచల దామోదర్,యాదయ్య,లక్ష్మణ్,శేఖర్,దండేటి మహేష్, ఇర్రగోని శ్రీరామ్, ఇర్రగోని శివ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ కాంగ్రెస్ మీడియా పబ్లిసిటీ విభాగం చైర్మన్‌కు శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/భువనగిరి** : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మీడియా పబ్లిసిటీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హీరేకార్ శ్రీను, ఎండి.కరీం మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన బాధ్యతల్లో విజయవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి మీడియా విభాగం కీలక పాత్ర పోషించాలని వారు పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శ



**ప్రజాపక్షం/నకిరేకల్** : పట్టణానికి చెందిన పగిడిమర్రి మధుసూధన్ శర్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి చిత్రపటానికి ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అదేవిధంగా నకిరేకల్ పట్టణానికి చెందిన భోగాని శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన పందిరి మమతకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.1 లక్ష 75 వేల విలువైన చెక్కును ఎమ్మెల్యే వేముల వీరేశం అందజేశారు.

## బీర్ల అనిత జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/మోటకొండూర్** : ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలన్న సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత జన్మదినం సందర్భంగా మోటకొండూరు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘు నాథరాజు, టౌన్ ప్రసిడెంట్ బుగ్గ కొంరయ్యల ఆధ్వర్యంలో మోటకొండూర్ మండల కేంద్రంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణి చేశారు. అనంతరం మోటకొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రేడ్ ప్యాకేట్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ నెమ్మాని సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు కొంత మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్గౌడ్, పట్టణ సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆర్టీఐ కమిషనర్‌కు స్వాగతం

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : అమెరికా దేశంలో దాదాపు 9 రాష్ట్రాల పర్యటనను విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన తెలంగాణ రాష్ట్ర సమాచార (ఆర్టీఐ)కమీషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డిని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం శంషాబాద్ ఇంటర్నేషనల్ అరైవల్స్ లో శనివారం మండల నాయకులు కలిసి ఘన స్వాగతం పలికారు. వీరిలో తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎరుకల వెంకటేష్ గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ పాముల రాజు గౌడ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట జహంగీర్, కోట సురేష్, భూక్యా రమేష్ నాయక్, బొల్లారం జగదీష్, బండారి శ్రీను, రొయ్యల మధు, దగడ్ రమేష్ ఉన్నారు.



# రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టిపెట్టాలి

10 నుంచి రైతులతో మాట పంట మార్పిడికి బాట

క్షేత్రస్థాయిలో అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి

రైతులతో పంట మార్పిడి చేయించే బాధ్యత ప్రతి ఒక్కరిదీ

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో తీవ్ర వర్షభావ పరిస్థితులు నెలకొంటున్నందున రైతులు వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను వేసుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. ఎల్‌నినో పరిస్థితులపై రైతులను అప్రమత్తం చేసేందుకు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించేందుకు ఈనెల పది నుంచి రైతులతో మాట పంట మార్పిడికి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు ప్రతి అధికారి పదిమంది రైతులను కలిసి వర్షాభావ పరిస్థితులపై వివరిస్తూ రైతులు వేయాల్సిన పంటలను సూచించనున్నట్లు తెలిపారు. జూన్, జూలై మాసాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా వర్షాలు వచ్చాయని, రాబోయే రోజుల్లో దీని ప్రభావం మరింతగా ఉంటుందన్నారు. ప్రస్తుతం రైతులు ప్రాజెక్టులపై ఆధారపడి కొందరు, బోరుబావులపై ఆదారపడి మరికొందరు వరి నాట్లు వేశారని తెలిపారు. నాగార్జునసాగర్ 300 టిఎంసిలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 130 టిఎంసిలు మాత్రమే ఉందని దీంతో సాగునీటికి సాగర్ నుంచి నీరు వచ్చే అవకాశం లేదన్నారు. అలాగే శ్రీరామ్‌సాగర్‌ప్రాజెక్టులో కూడా నీరు తక్కువగా ఉందని, మూసి కింద మాత్రం అక్టోబర్ వరకు నీటి లభ్యత జరుగుతుందన్నారు. జిల్లాలో 2లక్షల 35వేల ఎకరాలలో ఇంకా సాగు చేయాల్సి ఉందని, ఇప్పుడు వరివేసిన నీరు లేకుంటే ఐతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. చెరువులు, కుంటల్లో కూడా అంతతమాత్రంగానే నీరు ఉందని, వర్షం నీరు వారికి ఆధారం కావున రైతులు ఆలోచించి పంట మార్పిడి చేసుకోవాలన్నారు. రైతులు సాగు చేసుకునేందుకు కూరగాయాలు, కంది, మినుములు, పెసర, బొబ్బెర్లు వంటి పంటలు అనుకూలంగా ఉంటాయని రైతులకు కావాల్సిన రకాల విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ సౌకర్యాన్ని కూడా కల్పించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. రైతులు ఆలోచించి పంట మార్పిడి చేసుకోవాలని వరి పంట వేసి ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుతం వర్షబావ పరిస్థితులు నెలకొన్నందున రైతులు వరివేసి నష్టపోకుండా ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పేదలకు రైతాంగానికి తిండికి లోటు లేకుండా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. రైతులు వర్షభావ పరిస్థితుల దృష్ట్యా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపాలని అందుకు హార్టికల్చర్ అధికారులు కూడా తగిన సహాయసహకారాలు అందిస్తారని అన్నారు.

# పోరాటయోధుడు పండగ సాయన్న

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** భూస్వాములు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు పండగ సాయన్న అని బిఆర్ఎస్ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని దిర్శించర్ల గ్రామంలో పండగ సాయన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్లెపంగు నాగరాజు, పంగ బుచ్చిబాబు, తక్కెళ్ల నాగార్జున, షేక్ నాగుల్‌మీరా, గౌతమ్, తురక వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ రామనర్సయ్య, పటాని వెంకటయ్య, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.


**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బహుజన వీరుడు పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాపోలు పరమేష్ కోరారు. శనివారం స్థానిక బీసీ భవన్‌లో పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకుని బీసీ సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం సాగించిన గొప్ప వీరుడు పండుగ సాయన్న అని గుర్తుచేశారు. ఈ నెల 9న నల్లగొండలో నిర్వహించే సామాజిక న్యాయ పోరాట సభను అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాపోలు పరమేష్, బీసీ జేఏసీ కన్వీనర్ దాసరాజు జయరాజు, చిరంజీవి, చేగొండి మురళి యాదవ్, పున్న రాములు, పిల్లలమర్రి రవి పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పీడిత, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన తెలంగాణ బంధువు పండుగ సాయన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని బిసిజెఎసి కన్వీనర్ బద్రబోయిన సైదులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద పండుగ సాయన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బైరోజు మదనాచారి, కూరాకుల శ్యాంసుందర్, కక్కిరేణి నాగేంద్రబాబు, ముత్యం నాగేంద్రబాబు, యోగి, వీరు, నరేష్, వెంకన్న పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** జైగౌడ జాతీయ ఉద్యమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ 376వ జయంతి జాతీయ వారోత్సవాల సందర్భంగా ఈనెల 10న హైద్రాబాద్ లోని రవీంద్రభారతిలో జరిగే మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం మండల పరిధిలోని కీతవారిగూడెంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుండు వీరబాబుగౌడ్, గుండు రమేష్‌గౌడ్, అమరగాని సతీష్‌గౌడ్, అమరగాని మణిదీప్‌గౌడ్, బొల్లేపల్లి శ్రీనివాసగౌడ్, గండు సురేష్‌గౌడ్, పొలంపల్లి గోపయ్య పాల్గొన్నారు.








# నీటి సంపులో పడి రెండేళ్ల బాలుడు మృతి

చెరువుగట్టులో విషాదం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** ఆడుకుంటూ వెళ్లిన రెండేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందిన తీవ్ర విషాదకర సంఘటన చెరువుగట్టు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పునారం నిహోరే తాపీ మేస్త్రీగా పనిచేస్తూ, గత ఐదేళ్లుగా కుటుంబంతో సహా నార్కట్‌పల్లిలో నివాసముంటున్నాడు.శుక్రవారం నాడు నిహోరే తన భార్య సరిత,చిన్న కుమారుడు మోహిత్ తో కలిసి చెరువుగట్టు గ్రామంలోని కప్పే శ్రీశైలం నివాసంలో తాపీ పని చేయడానికి వెళ్లాడు. మధ్యాహ్నం సుమారు 12:45 గంటల ప్రాంతంలో దంపతులిద్దరూ పనిలో నిమగ్నమై ఉండగా, ఆడుకుంటున్న చిన్నారి మోహిత్ ప్రమాదవశాత్తు సమీపంలో ఉన్న నీటి సంపులో పడిపోయాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే బాలుడిని బయటకు తీసినప్పటికీ, అప్పటికే చిన్నారి మృతి చెంది ఉన్నాడు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని బాలుడి తండ్రి పునారం నిహోరే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి విష్ణుమూర్తి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# గుర్తుతెలియని వాహనం ఢీ ట్రాక్టర్ డ్రైవర్ మృతి



**ప్రజాపక్షం/వేములపల్లి:** మండల కేంద్రంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చెరుకు సత్యనారాయణ(50) వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. రోజువారీ పనులు ముగించుకుని రోడ్డుపై కాలినడకన తన ఇంటికి వస్తుండగా వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఆయన్ను బలంగా ఢీకొట్టింది.ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణ రోడ్డుపై స్పృహతప్పి పడిపోయారు.దీన్ని గమనించిన స్థానికులు వెంటనే ఆయన్ను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధృవీకరించారు.సమాచారం అందుకున్న వేములపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఢీకొట్టి పారిపోయిన వాహనం కోసం గాలిస్తున్నామని, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

# ఫుట్‌పాత్‌లపై మటన్, చేపల విక్రయాలకు అనుమతి లేదు

కమిషనర్ బి.వంశీ కృష్ణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నగర మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫుట్‌పాత్‌లు,రోడ్లు,ప్రజా ప్రదేశాల్లో మటన్, చేపల దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు నిర్వహించడం ఇకపై అనుమతించబడదని మున్సిపల్ కమిషనర్ బి.వంశీ కృష్ణ పేర్కొన్నారు.శనివారం నగరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారాల్లో ఫుట్‌పాత్‌లపై మటన్,చేపల విక్రయాలు నిర్వహించడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో పాటు,మాంసం,చేపల వ్యర్థాలను రోడ్లు,డ్రైన్లలో పడవేయడం వల్ల అపరిశుభ్రత,దుర్వాసన, ప్రజారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించి ఫుట్‌పాత్‌లపై మటన్ లేదా చేపల విక్రయాలు నిర్వహించినట్లయితే వ్యాపారం నిలిపివేయడంతో పాటు దుకాణం సీజ్ చేయడం జరుగుతుందన్నారు.